epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 34 | ఆదివారం | 19.05.2024



# పల్లా దొంగ ఓట్ల ఎమ్మెల్యే..!

**జనగామ, మన చౌరాస్తా ప్రతినిధి :**

‘జనగామ ప్రజలను చెరువులో నుంచి తీసి బావిలో వేసినట్టు అయ్యింది.. ఇంతకాలం ఉన్న ముత్తిరెడ్డి పోయిండు అనుకుంటే.. మల్లా గీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి వచ్చాడు.. దొంగ ఓట్లతో గెలిచిన ఆయన మీకు ఎమ్మెల్యే కానేకాదు.. ఓడినా నైతికంగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జనగామ ఎమ్మెల్యే..’ అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించారు. ఓట్ల కోసం వచ్చే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మూడు ఉమ్మడి జిల్లాలకు ఉన్న ఎమ్మెల్సీ పదవిని ఎందుకు వదిలేశాడో చెప్పాలని ప్రశ్నించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రుల సన్నాహక సమావేశం నిర్వహించారు. జనగామ డీసీసీ ప్రెసిడెంట్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు అభ్యర్థి తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ పల్లా రాజేశ్వర్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే అని, గతంలో ఎమ్మెల్సీగా దొంగ ఓట్ల గెలిచాడని ఆరోపించారు. పల్లా మంత్రి అవుతాననే ఆశతో జనగామకు వచ్చాడన్నారు. ఈయన దెబ్బకు సొంత పార్టీలోని ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డే పత్తలేకుండా పోయాడని, ఇక మీరెంత అని అన్నారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జనగామలో ఓడి పోవచ్చు కానీ, జనగామ నియోజకవర్గానికి ఆయనే ఎమ్మెల్యే అంటూ చెప్పుకొచ్చారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ కుటుంబంతో పాటు పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా జైలుకు వెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు.

### ఎమ్మెల్సీ తట్టను ఎందుకు వదిలేసిండు

- అప్పుడు.. ఇప్పుడూ దొంగ ఓట్లతోనే గెలిచిండు
- ఆయన వల్లే మళ్లీ ఉప ఎన్నికలు..
- మళ్లీ ఓటు అడిగే హక్కు ‘పల్లా’కు లేదు
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

### ఆశీర్వదించండి.. అండగా ఉంటా..

పట్టభద్రులు తన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని, మీ ఓటును వృథా చేయకుండా ఎల్లప్పుడు అండగా ఉంటానని తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తే రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీకి పోతుందన్నారు. గ్రామాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు లిస్ట్ ప్రకారం ఓటర్ల వద్దకు వెళ్లి ఓట్లు అడగాలన్నారు. బీఆర్ఎస్ ప్రచారం పెద్ద అమ్మలోళ్లు చేసినట్లు ఉన్నదని, వాళ్లను వాళ్లే కొట్టుకుంటున్నారని, ఇక బీజేపీ అభ్యర్థి ముసలాయన అని, ఆయన నల్గొండ పోయే వరకు ఎన్నికలు అయిపోతాయని ఎద్దేవా చేశారు. కేటీఆర్ తనపై కావాలని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నాడని, ఆయన ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మడం లేదన్నారు. తనకు ఓటు వేస్తే ప్రతి కార్యకర్త తల ఎత్తుకునేలా పని చేస్తానని మల్లన్న పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల జనగామ జిల్లా సమన్వయకర్త భవానీరెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి పద్మ, టీపీసీసీ మెంబర్ చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీలు గిరి కొండల్‌రెడ్డి, నిమ్మతి దీపిక మహేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్, జనగామ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికే ఇందిరా, సీనియర్ నేత డాక్టర్ రాజమౌళి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అభిగౌడ్, నాయకులు వంగాల మల్లారెడ్డి, జక్కుల వేణుమాధవ్, బొట్ల నర్సింగరావు, జనగామ నియోజకవర్గంలో ఎనిమిది మండలాల పట్టభద్రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గ్రూప్-1 ప్రిలిమినరీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి
- టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

2 లో



## రైతులు ఆందోళనకు గురికావద్దు

2

- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



## ధరణి, ప్రజావాణి దరఖాస్తులపై కలెక్టర్ ఫోకస్

2

- వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు



## పూడికతీత పనులు పూర్తి చేయండి

3

- బల్దియా కమిషనర్ అశ్విని

General News



# ధరణి, ప్రజావాణి దరఖాస్తులపై కలెక్టర్ ఫోకస్

- త్వరితగతిన పరిష్కరించాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాలు

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి, ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో ఆయన ధరణి, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. అలాగే ధరణి పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా మీసేవా పెండింగ్ దరఖాస్తులను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజూ ఈ పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై నివేదికను సమర్పించాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, ఈడీఎం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలి

**జనగామ, మన చౌరాస్తా :** ఈ నెల 27న జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశించారు. శనివారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానంపై సెక్టార్ అధికారులు, పీఓలు, ఏపీఓలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 23,419 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో పురుష ఓటర్లు 14,915 మంది ఉండగా, మహిళా ఓటర్లు 8,503 మంది, ఇతరులు ఒకరు ఉన్నారని వివరించారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ల పరిధిలో 27 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారులు, జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్, జనగామ, ఘనపూర్ (స్టేషన్) ఆర్డీఓలు దేవరాయి కొమరయ్య, డీఎస్. వెంకన్న, సెక్టార్ అధికారులు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు పాల్గొన్నారు.

## గ్రూప్-1 ప్రిలిమినరీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి
- టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** జూన్ 9న జరగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి ఆదేశించారు. శనివారం గ్రూప్ 1 ప్రిలిమినరీ ఎగ్జామ్‌కు సంబంధించిన ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, డీసీపీ, ఏసీపీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జనగామ జిల్లాలోని కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో పాటు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), డీఎన్ఓ పింకేశ్ కుమార్, ఏసీపీ, పీఎన్ఓ అంకిత్ కుమార్ శంక్వార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా కలెక్టర్లు, ఎస్పీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని వసతులు కల్పించాలని పేర్కొన్నారు. తగిన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలను అమర్చాలని సూచించారు. సెల్ ఫోన్లతో పాటు ఎలక్ట్రానిక్ సంబంధించిన వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని ఆదేశించారు. ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నపత్రాలను ఆయా పోలీస్ హెడ్ క్వార్టర్లలో తగిన బందోబస్తు మధ్య ఉంచాలన్నారు. జూన్ 9న 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష కోసం జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే మొత్తం 3,697 మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల్లో ఏర్పాట్లన్నీ పక్కా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో జనగామ ఆర్డీఓ కొమురయ్య, జడ్పీ సీఈవో అనిల్ కుమార్, రీజనల్ కోఆర్డినేటర్ నర్సయ్య, డీఈవో రాము, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు ఆందోళన వద్దు

- తడిచిన ప్రతి గింజను కొంటాం
- మంత్రి సీతక్క హామీ



**వరంగల్, మన చౌరాస్తా :** తడిసిన ప్రతి గింజను కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ మేరకు శనివారం ఆమె కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ములుగు జిల్లాలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఎలాంటి బెంగ పెట్టుకోవద్దని, తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఇక నుంచి పంటలకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లిస్తుందన్నారు. తమది రైతు ప్రభుత్వమని, రైతన్నలకు అండగా ఉంటామని మంత్రి పేర్కొన్నారు.

## స.హ చట్టం కమిషనర్లను నియమించాలి


- ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్

**హైదరాబాద్, మన చౌరాస్తా :** స.హ చట్టం కమిషనర్లను వెంటనే నియమించాలని ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సెక్షన్ 3 ప్రకారం దేశ పౌరులందరూ సమాచారం పొందే హక్కు ఉందన్నారు. సెక్షన్ 6 (1) ప్రకారం సమాచారం కోసం దరఖాస్తుదారులు వివిధ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోగా, 30 రోజులు ఇవ్వవలసిన సమాచారాన్ని కొన్ని నెలలు గడిచిన ఎలాంటి సమాచారం ఇవ్వక పోతే, సెక్షన్ 19(1) ప్రకారం మొదటి అప్పీల్ కూడా సమాచారం ఇవ్వట్లేదని, అలాగే సెక్షన్ 19(3) ప్రకారం రెండో అప్పీల్ చేస్తే స్టేట్ కమిషన్ ఆఫీస్ లో కమిషనర్లు లేక వేల దరఖాస్తులు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే కమిషనర్లను నియమించాలని, సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సూర స్రవంతి, ఉమ్మడి వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షులు నమిండ్ల హరీష్, అక్కెల్లి పవన్ కళ్యాణ్, స్ఫూర్తి, సంధ్య, కార్తీక్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షించాలి

**మహబూబాబాద్, మన చౌరాస్తా :** పర్యావరణ పరిరక్షణ పరమౌషధమని, ప్రతి మనిషి సామాజిక బాధ్యతగా చెట్లను నాటి పోషించాలని, లేకపోతే గ్లోబల్ వార్మింగ్ తో ఎడారిలా మారే ప్రమాదం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో "నీడ కోసమా... మొక్కల్ని నాటుదాంపర్యావరణాన్ని కాపాడుదాం " అని వ్రాసిన ఇనుప పలకాలను ఆవిష్కరించి, జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న చెట్టుకు కట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ పరికిపండ్ల అశోక్ చేపడుతున్న అనేక సృజనాత్మక సామాజిక సేవా కార్యక్రమాలు అభినందించదగ్గవని తెలిపారు. పర్యావరణం పట్ల ప్రజలను చైతన్యం చేసే క్రమంలో ప్రతి చెట్టుకు ఇనుప పలకాలను కట్టించే విధంగా 300 ప్లేట్లను తయారు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సురేష్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి తిరుపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటస్వామి, గవర్నమెంట్ ప్లీడర్ కొంపల్లి వెంకటయ్య, అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్ ఆనంద్, డి.ఎల్.ఎస్.ఏ, ప్రతినిధులు నాగేశ్వర రావు, యాదగిరి లతోపాటు లాయర్లు, కోర్టు సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

Local News



వాసవీ కన్యకాపరమేశ్వరి మాత జయంతి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



## ఘనంగా కన్యకా పరమేశ్వరి జయంతి

**జనగామ, మన చౌరాస్తా :** శ్రీనగేశ్వర శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి సీతారామచంద్ర స్వామి దేవాలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం వాసవీ మాత జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అష్టోత్తర శత కలశాలతో పంచామృతం, విశేష సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి స్వామివారికి అభిషేకం చేసి అలంకరించారు. సువర్ణ పుష్పార్చన, కుంకుమార్చనలు, పారాయణం, హోమం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నట్టు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

## ఘనంగా వీర బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం

స్టేషన్ ఘన్ పూర్, మన చౌరస్తా: జనగాం జిల్లా స్టేషన్ ఘన్ పూర్ మండల కేంద్రంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక బ్రహ్మంగారి ఆలయం నుండి వీరబ్రహ్మేంద్ర స్వామి పల్లకిని వీధుల్లో ఊరేగించారు. కేసోజు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేసోజు బాల నరసయ్య, మారెడుపాక మోహన్, కేసోజు చంద్రమోహన్, కేసోజు శ్రీను, మరేడుపాక లక్ష్మి నారాయణ, బ్రహ్మచారి, మారడుపాక శ్రీనివాస్, కేసోజు అనిల్, మారేడుపాక రాజ్ కుమార్, కేసోజు మహేష్, కేసోజు గణేష్ తదితరులు పాల్గొన్నారు.



www.manachourasta.com
మన చౌరాస్తా
The Complete News way



'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812



## మల్లన్నను గెలిపించాలి

**ములుగు, మన చౌరాస్తా :** ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య కోరారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశానికి వారు ముఖ్య అతిథిలుగా హాజరైన మాట్లాడారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో పేదల పక్షాన, నిరుద్యోగుల కోసం నిలబడి కొట్లాడిన మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, బ్లాక్, మండల గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పూడికతీత పనులు పూర్తి చేయండి

- బల్దియా కమిషనర్ అశ్విని
- గ్రేటర్ పరిధిలోని పలు ప్రాంతాలలో డీసిల్టింగ్ పరిశీలన

**హనుమకొండ, మన చౌరాస్తా :** నాలాల్లో పూడికతీత పనులు వేగవంతంగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. జీ డబ్ల్యూ ఎం సి పరిధి లోని హన్మకొండ ప్రాంతం లో కొనసాగుతున్న డీసిల్టింగ్ పనుల పురోగతిని శనివారం కమీషనర్ క్షేత్ర స్థాయి లో పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కాకతీయ డిగ్రీ కళాశాల సమీపంలో, హంటర్ రోడ్ జూ పార్క్ ఎదురుగా, నంది హిల్స్ ఏరియా జూలై వాడ ఎస్ టి హాస్టల్ దర్గా ఖాజీపేట రైల్వే ట్రాక్ వెంబడి ,అంబేద్కర్ భవన్ సమీపం లో ప్రెసిడెన్సీ స్కూల్ వద్ద గల నాలా, గుండ్ల సింగారం, ప్రాంతాల్లో నాలాల్లో డీసిల్టింగ్ తో పాటు పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా వారం రోజులలో డ్రైన్లు నాలాల్లో డీసిల్టింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, వర్షాలు కురిసే క్రమంలో వరద నీటికి ఆటంకాలు లేకుండా సక్రమంగా ప్రవాహం కొనసాగేలా చూడాలని, ప్రస్తుతం కొనసాగుతున్న డీసిల్టింగ్ పనులు పక్కగా జరిగితే క్షేత్ర స్థాయి లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని కమీషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ ఈ కృష్ణారావు సి ఎం హెచ్ ఓ డా. రాజేష్ ఈ ఈ రాజయ్య డీఈలు రవికుమార్ సంతోష్ బాబు శివానంద్ అజ్మీరా శ్రీకాంత్ ఏఈలు హరి కుమార్ మేనక విజయలక్ష్మి వెంకటేశ్వర్లు సానిటరీ ఇన్స్పెక్టర్లు అనిల్ కరుణాకర్ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఉత్కంఠ పోరులో ఆర్సీబీ విజయం



- 27 పరుగుల తేడాతో గ్రాండ్ విక్టరీ
- ప్లే ఆఫ్స్ కి దూసుకెళ్లిన బెంగళూరు.. చెన్నై ఇంటి ముఖం
- కీలక మ్యాచ్‌లో చెలరేగిన ఆర్సీబీ టాపార్డర్స్
- గెలవాల్సిన మ్యాచ్‌లో తడబడిన చెన్నై
- 10 పరుగుల తేడాతో ప్లేఆఫ్స్ రేసు నుంచి ఔట్
- నిరాశపరిచిన ధోనీ

**మన చౌరాస్తా, క్రీడా విభాగం :** ఐపీఎల్ 2024 సీజన్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్ లో ఆర్సీబీ టాపార్డర్స్ చెలరేగారు. దీంతో చెన్నై సూపర్ కింగ్స్ పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 27 పరుగుల తేడాతో గ్రాండ్ విక్టరీ సాధించింది. శనివారం సొంత గడ్డ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్ లో ఆర్సీబీ విజయం సాధించి ప్లే ఆఫ్స్‌లోకి దూసుకెళ్లింది. గెలవాల్సిన మ్యాచ్ లో తడబడిన చెన్నై... ఓడిపోవడంతో పాటు 10 పరుగుల తేడాతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసింది. ఒక దశలో ఆరసీబీ బ్యాటర్లు సీఎస్‌కే బౌలర్లకు చుక్కలు చూపించారు. ఆర్సీబీ బ్యాటర్లలో ఫాఫ్ డుప్లెసిస్ హాఫ్ సెంచరీతో చెలరేగగా.. విరాట్ కోహ్లి, రజిత్ పాటిదార్, కామెరాన్ గ్రీన్ అద్భుత ఇన్నింగ్స్‌లు ఆడారు. కోహ్లి, డుప్లెసిస్ జోడీ తొలి వికెట్ కు 78 పరుగులు జోడించి శుభారంభం అందించారు. కోహ్లి 29 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులతో 47 పరుగులు చేయగా... కెప్టెన్ డుప్లెసిస్ 39 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులతో 54 పరుగులు చేశాడు. రజత్ పాటిదార్ చిచ్చర పిడుగులా ఆడి 23 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సులతో 41 పరుగులు చేశాడు. సీఎస్‌కే బౌలర్లలో శార్ధూల్ ఠాకూర్ రెండు వికెట్లు, తుషార్ దేశ్‌పాండే, శాంట్నర్ తలా వికెట్ సాధించారు.

అనంతరం 219 పరుగుల లక్ష్య ఛేదనలో బ్యాటింగ్ కి దిగిన చెన్నైకి తొలి బంతికే షాక్ తగిలింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ను మాక్స్ వెల్ బౌలింగ్ లో యశ్ దయాళ్ కు క్యాచ్ ఇచ్చి డకౌట్ అయ్యాడు. దీంతో ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓ దశలో 19 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన సీఎస్కే.. కష్టాల్లో పడింది. రచిన్ రవీంద్ర 61 పరుగులు, రవీంద్ర జడేజా (42), ఎంఎస్ ధోనీ (25) రన్స్ చేయడంతో పోటీలోకి వచ్చింది. అయితే సీఎస్కే ప్లే ఆఫ్స్ చేరాలంటే చివరి ఓవర్ లో 17 పరుగులు అవసరం కాగా.. ధోనీ తొలి బంతినే సిక్స్ గా మలిచాడు. దీంతో లక్ష్యం 5 బంతుల్లో 11గా మారింది. అయితే రెండో బంతికే ధోనీ ఔట్ కాగా.. మూడో బంతి డాట్ అయింది. ఆ తర్వాత బంతికి సింగిల్ వచ్చింది. ప్లే ఆఫ్స్ కు చేరాలంటే చివరి రెండు బంతులకు 10 పరుగులు కావాలి. కానీ క్రీజులో ఉన్న రవీంద్ర జడేజా పరుగులేమీ చేయలేదు. దీంతో సీఎస్కే 7 వికెట్ల నష్టానికి 191 పరుగులకు పరిమితమై, 10 పరుగుల తేడాతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది.



## దీపికాకు

# అరుదైన గౌరవం

మన చౌరాస్తా, సినిమా : దీపికా పదుకొణె.. బాలీవుడ్ లో ఓ బ్రాండ్ సంపాదించుకున్న హీరోయిన్. బెంగుళూరుకు చెందిన ఈ అమ్మాయి యాక్టింగ్ పై ఇంట్రెస్ట్ తో ఎలాంటి సినీ బ్యాక్ గ్రౌండ్ లేకుండానే హిందీ చలన చిత్ర రంగంలో అడుగు పెట్టింది. ముందు మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన దీపికా... తన ఫస్ట్ మూవీ ఛాన్స్ బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ సరసన నటించే అవకాశం కొట్టేసింది. అనంతరం ఇక వెనుదిరిగి చూడకుండా అనతి కాలంలోనే బాలీవుడ్ లో టాప్ హీరోయిన్ స్థాయికి ఎదిగింది. అద్భుతమైన నటనతో అతి తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సొంతం చేసుకుంది. ఎన్నో బ్లాక్ బస్టర్ హిట్ చిత్రాల్లో నటించిన దీపికా... ఇప్పటివరకు మూడు ప్రతిష్టాత్మక ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ అందుకుంది. టైమ్ మ్యాగజైన్ 2018లో ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన 100 మంది వ్యక్తులలో ఒకరిగా ఆమెను సత్కరించింది. 2022లో టైమ్100 ఇంపాక్ట్ అవార్డు సొంతం చేసుకుంది. తాజాగా మరో అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. డెడ్ లైన్స్ గ్లోబల్ డిస్‌రప్టర్స్ అనే హాలీవుడ్ మ్యాగజైన్ ప్రతీ ఏడాది.. ప్రపంచవ్యాప్తంగా వినోదరంగంలో రాణిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ నటీనటుల జాబితాను విడుదల చేస్తుంది. అయితే ఆ మ్యాగజైన్ ఇటీవలే విడుదల చేసిన ఈ ఏడాది జాబితాలో దీపికా పదుకొణె చోటు దక్కించుకుంది. ఈ విషయాన్ని స్వయంగా ఆమె సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఈ సందర్భంగా దీపికా తన సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఇక ఇప్పటివరకు ఆ జాబితాలో పేరు దక్కించుకున్న భారతీయ నటి దీపికా పదుకొణె కావడం గమనార్హం.